క్లుప్తంగా

పసుపులో విత్తనశుద్ధి ముఖ్యం

అమరావతి: మండల పరిధిలోని రైతాంగం పసుపు పంటను అన్ని రకాల నేలలోను వేయవచ్చని, ఆగస్టు నెల పసుపు పంట నాటేందుకు అనకూలమైన కాలమని మండల ఏఓ అహ్మద్ తెలిపారు. మంగళవారం ఆయన పసుపు రైతులకు సూచనలిస్తూ పంటకు విత్తనశుద్ధి అవసరమని, లీటరు నీటికి 3 గ్రాముల రిథోమిల్, మింకోజబ్ పొడరును కలిపిన ద్రావణంలో విత్తన దుంపలను 25 నిమిషాలు ఉంచి నీడలో ఆరబెట్టి తరువాత విత్తాలన్నారు. అలాగే విత్తిన 2,3 రోజులలో పల కలుపు నివారణలో భాగంగా భూమిలో తేమ చూసుకుని లీటరు నీటికి 5మి.లీ లీటర్లు పెండీమిథాలిన్ కలిపిన ద్రావణం ఎకరాకు 250 లీ.వంతున నేలపై సమంగా స్ప్రే అయ్యేవిధంగా చేస్తే కలుపు నివారించవచ్చునన్నారు. అలాగే కొమ్ములను 15–30 సెం.మీ దూరంలో నాటాలి. నేలలో 7.5 సెం.మీ లోతు మించకుండా కొమ్ములను హెక్టారుకు 2,500 కిలోల చిన్న కొమ్ములను నాటాలన్నారు.

ప్రమాదాల నివారణకు స్టాపర్‌ల ఏర్పాటు



అమరావతి: రోడ్డు ప్రమాదాల నివారణకు అమరావతి సర్కిల్ పరిధిలో అమరావతి నుంచి గుంటూరు, సత్తెనపల్లి, విజయవాడ వెళ్ళే రహదారులలో గుంటూరుకు చెందిన అమృత హాస్పిటల్స్ సహకారంతో స్టాపర్స్‌ను మంగళవారం ఏర్పాటు చేయటం జరిగింది.. ఈసందర్భంగా సీఐ బ్రహ్మం మాట్లాడుతూ సర్కిల్‌లో 14వ మైలు, లేమల్లె, ఎండ్రాయి, నరుకుళ్ళపాడు వద్ద రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఈ స్టాపర్స్ ను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాత్రి సమయంలో కూడా వాహన చోదకులకు కనిపించే విధంగా వాటిపై రేడియం స్టిక్కర్లను అతికించడం జరిగిందన్నారు.

ఈకేవైసీ నమోదు తప్పనిసరి



నకరికల్లు: మండలంలో ఈకేవైసీ నమోదు చేసుకున్న రైతుల ఖాతాలో త్వరలో 14వ విడత పీఎం కిసాన్ నగదు జమ కానున్నట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మంగళవారం తెలిపారు. 1665మంది రైతులు ఇంకా ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. పీఎం కిసాన్ నగదు ఖాతాలో జమ కావాలంటే ఖచ్చితంగా ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉన్నందున అందరూ తప్పనిసరిగా ఆ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసుకోవాలన్నారు. వాస్తవ కౌలుదారురైతులు భూ యజమాని అనుమతితో కౌలుదారు సాగుహక్కు పత్రం పొందాలన్నారు. సీసీఆర్సీ కార్డును పొంది రైతుభరోసా పథకానికి అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలుసాగుదారులు రైతుభరోసా పథకం పొందేందుకు తమ వివరాలతో రైతుభరోసా కేంద్రంలోని సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

ముప్పాళ్ల జడ్పీ పాఠశాలలో 'ప్రేమ తరువు'



ముప్పాళ్ళ: నరసరావుపేట శ్రీసత్యసాయి సేవాసమితి వారి ప్రేమతరువు కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్ళ జడ్పీ పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శ్రీజగన్నాథస్వామి సేవాసమితి, గాయత్రిపరివార్ సభ్యులు, పాఠశాల పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రౌండ్ చుట్టూ మొక్కలు నాటారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, మాజీ హెచ్ఎం మారూరి రామలింగారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

అర్హులకు సంక్షేమం జగనన్న సురక్ష లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- ధ్రువీకరణ పత్రాలు అందజేత



క్రోసూరులో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు ఎలా ఎగ్గొట్టాలా అని చూశారని, ఇప్పుడు అందరికీ సంక్షేమ పథకాలు ఎలా ఇవ్వాలి అని జల్లెడపట్టి మరీ వెతికి అందజేస్తున్నామని, అప్పటికీ ఇప్పటికీ వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక ట్రావెలర్స్ బంగ్లా ఆవరణలో జరిగిన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 487మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రైతులకు నూరుశాతం సబ్సిడీపై కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే మనరాష్ట్రం అగ్రగామిగా ఉందన్నారు. పొరుగు రాష్ట్రాలు మొత్తం ఎలా సాధ్యపడుతున్నాయా అని ఆసక్తిగా మన రాష్ట్రం వైపు చూస్తున్నారన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు, ఎల్లో మీడియాకు కళ్లు బైర్లు కమ్మాయని, వారికి అమలవుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి కనిపించవన్నారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో రూ.700కోట్ల అభివృద్ధి, సంక్షేమ పనులు చేసినట్లు చెప్పారు. ఒక్క అచ్చంపేట సచివాలయం–1 పరిధిలో రూ.30.73 కోట్లు, సచివాలయం–2 పరిధిలో రూ.30.92 కోట్ల మేర అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. ఇందులో నాల్గవ వంతైనా గత ప్రభుత్వంలో జరిగిందా అని ప్రశ్నించారు. గతానికి, ఇప్పటికి బేరీజు వేసుకోండి.. మంచి జరిగిందనుకుంటేనే మళ్లీ మద్దతివ్వాలని కోరారు. సభకు ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం అధ్యక్షత వహించారు. తహసీల్దార్ సీహెచ్ పద్మాదేవి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ కంబాల వీరబాబు, మాజీ సర్పంచ్‌లు టీవీఎస్ మల్లిఖార్జునరావు, తుమ్మా చిన్నపరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నయల్లమందయ్య, జిల్లా బీసీసెల్ కన్వీనర్ సాతర్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ మెహిద్దీన్, ఉప సర్పంచ్ జానీ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కంకణాలపల్లిలో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

క్రోసూరులో...

క్రోసూరు: సంక్షేమ పథకాలు అందుకోవడంలో పేదలకున్న సమస్యలు తీర్చేందుకే జగనన్న సురక్ష శిబిరాలు ఏర్పాటు చేయటం జరిగిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం క్రోసూరు సచివాలయం–2 పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరయ్యారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా లబ్ధిదారుల సమస్యలు తెలుసుకోవడానికి అధికారులే ఇంటికి వస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలు కూడా వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేనని అన్నారు. ఈశిబిరంలో 410 అర్జీలు రాగా వాటిలో 321 సర్టిఫికెట్లు అందచేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ బి.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, వెలుగు ఏపీఎం సలీం, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఉప సర్పంచ్ షేక్ మస్తాన్, యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, డాక్టర్ షరీఫ్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, గార్లపాటిదాసు, ఎంపీటీసీ వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంకణాలపల్లి, పాకాలపాడులో...

సత్తెనపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే పాలన అందిస్తున్నారని సత్తెనపల్లి ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ అన్నారు. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లిలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు దక్కని వారిని గుర్తించి అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా 318 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెరుకూరి వస్నూరు, వైఎస్సార్ సీపీ నాయకులు గొడుగుల సుబ్బారావు, డీలర్ రవిచంద్రన్, ఎంఈఓ ఎ.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రామ్మోహన్ సింగ్, ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ జనని పాల్గొన్నారు. అలాగే సత్తెనపల్లి మండలం పాకాలపాడులో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.సురేష్ పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ తిప్పిరెడ్డి సుజాత లక్ష్మి 280 మందికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందించారు.ఎంపీటీసీ సభ్యుడు కాల్వపల్లి రమేష్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిభద్రతలు నెలకొల్పాలి



తహసీల్దార్ కె.నగేష్‌కు మెమోరాండం ఇస్తున్న సీపీఎం, అనుబంధ సంఘాల నాయకులు

నకరికల్లు: మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమం దేశంలోని యావత్ ప్రజానీకాన్ని కలచివేస్తున్నాయని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలపై చర్యలు తీసుకునేందుకు గాను కేంద్రప్రభుత్వానికి సమర్పించనున్న మెమోరాండాన్ని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కె.నగేష్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి, కేంద్రహోం మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కుకీ తెగప్రజలకు రక్షణ కల్పించి శాంతి భద్రతలను కాపాడాలన్నారు. ఉన్మాదానికి పాల్పడిన దుండగులను మరింత కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ముందుగా స్థానిక భగత్‌సింగ్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గిరిజనసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.కోటానాయక్, కౌలురైతుసంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, రైతుసంఘం నాయకులు ఈవూరి అప్పిరెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు, వ్యవసాయకార్మికసంఘం నాయకులు చట్టు కోటేశ్వరరావు, రామాంజినాయక్, సీఐటీయు నాయకులు గోదా చిన్ని తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో...

పెదకూరపాడు: మణిపూర్‌లో మహిళలపై అకృత్యాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని సీపీఐ నియోజకవర్గ శాఖ ఆధ్వర్యంలో పెదకూరపాడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగోటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు గ్రామాల మధ్య గొడవ పరిష్కరించలేని బీజేపీ ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షాల నిర్లక్ష్యం వల్లే మణిపూర్ రాష్ట్రం అగ్నిజ్వాలల్లో రగిలిపోతుందన్నారు. శాంతియుత వాతావరణం ఏర్పడేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు ప్రసాద్, రాజారత్నం, సుధాకర్, యాకోబు, ఏడుకొండలు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో జరగాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. మండలంలో గత పాలకులు చేయని అభివృద్ధి కార్యక్రమాలు ఈనాలుగేళ్లల్లో చేశామన్నారు. సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికి చేరుతున్నాయన్నారు. రైతులు పత్తి, మిర్చితోపాటు, ప్రత్యామ్నాయ పంటలుగా ఉద్యావన పంటలపై దృష్టి సారించాలన్నారు. అన్ని గ్రామాల్లో మంజూరైన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బిల్డింగ్‌లు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో అన్ని పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశానికి ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వైఎస్ ఎంపీపీ షేక్ బాషా, తహసీల్దార్ క్షమారాణి, ఎంపీడీఓ నరసింహారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు....

అచ్చంపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న అనేక కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. తాజాగా మండలంలోని చిగురుపాడు గ్రామానికి చెందిన టీడీపీ, జనసేనలకు చెందిన 10 కుటుంబాలవారు మంగళవారం ప్రత్యేకవాహనాలలో గుంటూరు తరలి వెళ్లి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే శంకరరావు వారందరిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పసుపులేటి నాగరాజు, గోపిశెట్టి నరశింహారావు, ఆకుల రామదాసు, ఎనుముల బజారు, యనుముల పెద చెంచయ్య, కె.వీర్రాజు, కె.నరసింహారావు, కుంభా కృష్ణా తదితర కుటుంబాలవారు ఉన్నారు.

దేవాలయాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి...

పెదకూరపాడు: పల్నాడు జిల్లాలో తిరుమల తిరుపతి దేవస్థానం వారి శ్రీవాణి ట్రస్టు ద్వారా మొత్తం 50 దేవాలయాలు మంజూరు అయ్యాయని, పెదకూరపాడు నియోజకవర్గానికి 32 దేవాలయాలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే కార్యాలయంలో పల్నాడు జిల్లా దేవదాయ శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, ఎండోమెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వైకుంఠరావు, దేవాలయాల ఈఓలు, దేవాలయాల కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ నియోజకవర్గానికి మంజూరైన 32 దేవాలయాల్లో ఇప్పటికే 18 దేవాలయాలు ప్రారంభించామన్నారు. మిగిలినవి కూడా త్వరలో ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. నవంబరు 15 నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో దేవాలయాల నిర్మాణాలు చేపట్టదలచిన వారు వెంటనే దేవదాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

పేదలకు అందుబాటులో దంత వైద్యం



ఎంఓయూ పత్రం అందుకుంటున్న కొత్త రామకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

సత్తెనపల్లి: నేషనల్ ఓరల్ హెల్త్ ప్రోగ్రాం వారితో పట్టణంలోని ఏరియా వైద్యశాల ఎంఓయూ కుదుర్చుకున్నట్లు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ చెప్పారు. మంగళవారం వైద్యశాలలో ఎంఓయూ అనంతరం ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఏరియా వైద్యశాలలో దంత వైద్యంకు సంబంధించి కేవలం పళ్లు పీకటం, ఫిల్లింగ్ మాత్రమే జరిగాయని, కానీ పేద ప్రజలకి పళ్లు పెట్టించుకోవటం, యాక్సిడెంట్ కేసుల్లో పళ్లు విరిగితే వాటిని సరి చేయటానికి క్లిప్పులు పెట్టుకోవటం వంటి సౌకర్యాలు లేకపోవడంతో బాగా ఇబ్బంది పడే వారన్నారు. ప్రైవేటుగా దంత వైద్యం చేయించుకోవాలంటే వేలకు వేలు ఖర్చు అవుతుందన్నారు. కానీ ఈ ప్రోగ్రాం ద్వారా కంప్లీట్ పళ్ల సెట్టు, ఎక్కడైనా పళ్లు విరిగితే కొత్తవి పెట్టడం, మెటల్ క్యాప్స్ పెట్టడం పూర్తి ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు మాట్లాడుతూ పూర్తి పంటిని కట్టించడంతోపాటు మెటల్ క్యాపులు కూడా గవర్నమెంట్ అందించటం ఎంతో శుభ పరిణామం అని అన్నారు. అదేవిధంగా ప్రత్యేక శ్రద్ధ వహించిన వైద్యశాల అభివృద్ధి కమిటీకి ధన్యవాదాలు తెలియజేశారు. డెంటల్ డాక్టర్ జఫ్రీ మాట్లాడుతూ పేద ప్రజలకు నిజంగా ఇది ఒక వరం అన్నారు. ఈ సేవలను ఉపయోగించు కోవాల్సిందిగా కోరారు. వైద్యశాల నర్సింగ్ సూపరిండెంట్ రాధ, ఆర్ఎంఓ శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ రోడ్డులో గుంతలకు మరమ్మతులు

సత్తెనపల్లి: పట్టణంలోని రైల్వే స్టేషన్‌రోడ్డులో రహదారి గుంతలమయంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ కొలిమి షమ్మీ ఆదేశాల మేరకు రహదారి గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బందులు తొలగించారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం

క్రోసూరు: జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు క్రోసూరులో తక్కువ ధరకు బియ్యం, కందిపప్పు విక్రయ కౌంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని కౌంటర్ ప్రారంభించగా తహసీల్దార్ జియావుల్ హక్, సీఎస్‌డీటీ గఫూర్ పర్యవేక్షించారు. స్థానిక అందుకూరు రోడ్డులోని కూరపాటి లక్ష్మీనారాయణ కిరాణాషాపు వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్‌లో కిలో కందిపప్పు రూ.135లకు, కిలో బియ్యం రూ.48 లకు కౌంటర్ ద్వారా అందింస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. క్రోసూరు కిరణా మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు కోట భాస్కర్, కూరపాటి కృష్ణ, దేవరశెట్టి నాగేశ్వరరావు, చుండురు బుజ్జి, బెల్లంకొండ శ్రీను పాల్గొన్నారు.

హేతువాది ఉ.సా. చిరస్మరణీయుడు

సత్తెనపల్లి: ఉ.సా అనే కలం పేరుతో ప్రసిద్ధి చెందిన ఉద్యమాల సాంబశివరావు 3వ వర్ధంతి కార్యక్రమం సత్తెనపల్లి బీసీ సంఘాలా ధ్వర్యంలో సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉ.సా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గుడిపూడి సర్పంచ్ తొరటి తిరుపతయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. ఉ.సా డెమోక్రాటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ సభ్యుడిగా, కమ్యూనిస్ట్ దిగ్గజం తరిమెల నాగిరెడ్డి శిష్యుడుగా ఉన్నాడన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయి జైలు జీవితం గడిపిన ఉద్యమకారుడన్నారు. పూలే, అంబేడ్కర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి ఇతర సారూప్యత కలిగిన వ్యక్తులతో కలసి అతను దేశీ–దిశ వెబ్ ఛానల్‌ని ప్రారంభించాడని కొనియాడారు. బీసీ సంఘాల నాయకులు పేరుబోయిన ప్రకాష్, వంగిపురపు పరమేశ్వరావు, చామర్తి చిన్నా, పిక్కిలి శివ, విప్పర్లకొండలు, లేపాకుల మల్లికార్జున, గుంటూరు గోవింద్, గుంజి విజయకుమార్ ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టిపెట్టాలి

సత్తెనపల్లి: చిన్న, సన్న కారు రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయం వైపు మనసు పెట్టాలని, అపరాల పంటలు సాగు చేయాలని సత్తెనపల్లి మండల ఏపీఎం శిఖా కృపావేణి అన్నారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో చిన్న, సన్న కారు రైతులకు సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల ఇందిరా క్రాంతి పథం కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సదస్సుకు డీబీఆర్సీ రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప అధ్యక్షత వహించారు. కృపావేణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులు ప్రభుత్వం పంట సాగుదారుల చట్టం ద్వారా ఇస్తున్న సీసీఆర్సీ కార్డులు పొంది ప్రభుత్వం ద్వారా వస్తున్న రైతు భరోసా, బ్యాంక్ రుణాలు, ఇన్పుట్ సబ్సిడీ, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీపై పొందేందుకు అవకాశం ఉంటుందన్నా రు. వెలుగు కమ్యూనిటీ కో–ఆర్డినేటర్ బుల్లిబాబు మాట్లాడుతూ ముఖ్యంగా రైతులు పంటలు మా ర్పు చేయడానికి భూసార పరీక్షలు చాలా అవసరమని, భూసార పరీక్షలు చేయించుకొని పొలాల్లో పం టలు వేసినట్లయితే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ప్రకృతి వ్యవసాయానికి రూ. 10 వేలు సబ్సిడీ ఇస్తుందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ గాడిదపాటి రవికుమార్, సతీష్, డానియల్, వివిధ గ్రామాల ఎస్సీ, ఎస్టీ రైతులు, కౌలు రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

ముగిసిన పద్యపోటీలు

వినుకొండ(నూజెండ్ల): మహాకవి, కవికోకిల గుర్రం జాషువా 52వ వర్ధంతి కార్యక్రమం సందర్భంగా జాషువా సాంస్కృతిక సమాఖ్య సౌజన్యంతో జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రాష్ట్రస్థాయి రంగస్థలం, పౌరాణిక పద్యపోటీలు ముగిశాయి. పద్యపోటీల్లో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని మాట్లాడుతూ కుల వివక్ష, పేదరికాలను తన గురువులుగా భావించి చీత్కా రాలు, అవమానాలు ఎదుర్కొన్న చోటే సన్మా నాలు పొందడం అది ఒక్క మహాకవి గుర్రం జాషువా వలనే సాధ్యమైందన్నారు. అటువంటి మహోన్నత వ్యక్తి మన వినుకొండ వాసి అవడం నిజంగా మనం చేసుకున్న అదృష్టమన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి నీలం వెంకటేశ్వర్లు (అచ్చంపేట), ద్వితీయ బహుమతి మురికిపూడి రత్నకుమార్ (గోపువారిపాలెం), తృతీయ బహుమతి లాలునాయక్ (చిలకలూరిపేట)లకు బహుమతులు అందజేశారు. సంస్థ అధ్యక్షుడు వెంకట్రావు, సభ్యులు, జాషువా సాంస్కృతిక సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

అన్నివర్గాలకు మేలే ప్రభుత్వ లక్ష్యం

గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: గత నాలుగేళ్లలో రాష్ట్రంలో అన్నివర్గాలకు మేలు చేకూరిందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోగంటివారిపాలెంలో బుధవారం రాత్రి ఆయన వర్షాన్ని సైతం లెక్కచేయక ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఎవరికి ఎంత లబ్ధి చేకూరిందో తెలియచేశారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి సూచనలిచ్చారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలువేసి ఘన నివాళులర్పించారు. గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత నాలుగేళ్లలో కోగంటివారిపాలెం సచివాలయ పరిధిలో రూ.10కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. వివిధ సంక్షేమ పథకాల రూపంలో గ్రామస్తులకు రూ.16కోట్ల మేర లబ్ధి చేకూరిందన్నారు. ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఇచ్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

సంక్షేమ పథకాలు ఆగకుండా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహనరెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. జడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సీహెచ్ ఎస్సార్కే సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ సుంకర శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ బోనం నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, సొసైటీ మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షా కాలం.. జరభద్రం

- డెంగీ, మలేరియా వంటి విషజ్వరాలపై అప్రమత్తత అవసరం
- పలు ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, ర్యాలీలు



డెంగీ నివారణ మాసోత్సవ ర్యాలీ చేస్తున్న సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది

సత్తెనపల్లి: వర్షాకాలం అంటేనే వ్యాధుల కాలం. సీజనల్ వ్యాధులైన డెంగీ, వైరల్ ఫీవర్, మలేరియా, టైఫాయిడ్ వంటివి ఈ కాలంలో అధికంగా వస్తుంటాయి. ఈ నేపథ్యంలో ప్రజల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. అవసరమైన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మందులను ఉచితంగా అందజేస్తోంది. రోగ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి అవసరమైన వైద్యసహాయం అందించేందుకు 50వ విడత ఫీవర్ సర్వే చేపట్టాలని వైద్యా రోగ్యశాఖ ఆదేశించింది. ఈ సర్వేను నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, సచివాలయ పరిధిలోని వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్లు సర్వేను ప్రారంభించింది. ఈ సర్వేలో ఆరోగ్య కార్య కర్తలు, కమ్యూనిటీ హెల్త్ సూపర్వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నారు. ఈ సర్వే నెలాఖరు వరకు జరుగనుంది. జ్వర లక్షణాలు ఉన్న వారి రక్తం సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపుతారు. ఇలా ఎవరికైనా జ్వరాలు నిర్ధారణ అయితే వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే వైద్య ఆరోగ్య సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది నిత్యం బందాలుగా ఏర్పడి ప్రజల ఆరోగ్య అంశాలపై ఆరా తీస్తున్నారు. అవసరమైన చోట అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య పనులపై పంచాయతీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

ప్రజలకు అవగాహన ...

వర్షాకాలంలో వీధులు, మురుగు కాలువల్లో నీరు నిల్వ చేరితే దోమలు ఇట్టే వ్యాప్తి చెందుతాయి. దీనిని నివారించేందుకు పారిశుద్ధ్య సిబ్బంది చర్యలు చేపడుతున్నారు. అలాగే ప్రజలకు సైతం అవగాహన కలిగిస్తున్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు, దోమల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సర్వే చేసిన సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తోంది. ఆ రోజు ఆశా వర్కర్లు, వలంటీర్లు,ఆరోగ్య కార్యకర్తలు,ఇంటింటికీ వెళ్లి ప్రజలకు జ్వరాల పై అవగాహన కలిగిస్తున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిత్యం అవగాహనా సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. ప్రతి ఒక్కరూ వర్షా కాలంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమతెరలు వాడాలి. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలి.

–సీహెచ్ ప్రభాకర్‌రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి, సత్తెనపల్లి

ఏపీ పీజీ సెట్ -23లో విద్యా కేంద్రం విద్యార్థి ప్రతిభ



సత్తెనపల్లి: ఏపీ పీజీ సెట్ - 2023లో పట్టణంలోని రఘురాంనగర్‌లో గల విద్యా కేంద్రం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి షేక్ ఆదిల్ ప్రతిభ కనబరిచాడు. ఏపీ పీజీ సెట్ -2023 ఫిజిక్స్ విభాగంలో 87 ర్యాంకు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో ఆదిల్‌ను కళాశాల డైరెక్టర్ నిమ్మగడ్డ వెంకట్రావు ప్రత్యేకంగా అభినందించారు. 87వ ర్యాంకు కైవసం చేసుకోవడం హర్షణీయమన్నారు. విద్యార్థులను ప్రగతి పథంలో నడిపించేందుకు విద్యా కేంద్రం ఎప్పుడు ముందు ఉంటుందన్నారు. ఆదిల్‌ను ఆదర్శంగా తీసుకొని మరింత మంది విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి చుక్కా వెంకటేశ్వర్లు అన్నారు. డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా మంగళవారం పట్టణంలోని నాగార్జుననగర్‌లోని హ్యారిస్ పాఠశాలలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సు, ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, ముఖ్యంగా దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. వాటిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఇంటి బయట, లోపల నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకుడు బి.రోశయ్య మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెచ్ఎం ఎం.సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ దోమలు ఉత్పత్తి కాకుండా తీసుకునే చర్యలపై అవగాహన కలిగిఉండాలన్నారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుడు శివారెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆరోగ్య పర్యవేక్షకులు వై.రాజేష్ పాల్, ఆరోగ్య కార్యకర్తలు ఎంపీ కిరణ్‌బాబు, ఎస్ఎం హుస్సేన్, షేక్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.